

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం

03 ఫిబ్రవరి 2026 పేజీలు : 08


మండల స్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు నెల్లూరు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 'క్యూ' కడుతున్నారు. రెవెన్యూకు సంబంధించి అత్యధికంగా అర్జీలు దాఖలవుతున్నాయి. మండల స్థాయిలో అర్జీలు.. అర్జీలుగానే మిగిలిపోతున్నాయి. దీంతో జిల్లా కలెక్టర్‌కు నేరుగా విన్నవించేందుకు అర్జీదారులు 'క్యూ' కట్టడంతో నెల్లూరు కలెక్టరేట్ సోమవారం అర్జీదారులతో నిండిపోయింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కొనసాగుతూనే ఉంది. నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



- సమస్యల అర్జీలతో పెద్ద ఎత్తున హాజరైన ప్రజలు
- మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు
- కలెక్టరేట్‌కు 'క్యూ' కడుతున్న ప్రజలు
- సుమారు 640 అర్జీలు.. రెవెన్యూ శాఖవే అధికం

# కిటకిటలాడిన కలెక్టరేట్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

ప్రజల నుంచి కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, డిఆర్డిఏ పిడి నాగరాజు కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కృష్ణ కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శ్రీధర్ రెడ్డి, డిపిఓ వాసుమతి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు, పింఛన్లకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా

-మిగతా 2లో



# చట్టప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం

జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్ల

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :**

జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదు దారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫిర్యాదుదారులను మాట్లాడించి వారికి తక్షణమే ఉపశమనం కలిగించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో 180 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్పీ తెలియజేశారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని, ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం జరిగే విధంగా పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఈ సందర్భంగా ఆదేశించారు.



ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య, నెల్లూరు టౌన్ ఏఎస్పి దీక్ష, రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీని వాసరావు, ఎస్బి డిఎస్పి శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, పిసిఆర్ సీఐ భక్తవ త్సవ రెడ్డి, మహిళా స్టేషన్స్ సీఐ సుబ్బారావు, ఎస్బి-2 సిఐ శ్రీనివాస్ రెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే

# కఠిన చర్యలు

- జేసీ మొగిలి వెంకటేశ్వర్లు

**నిరంతర నిఘా తనిఖీల కోసం ఫ్లైయింగ్ స్క్వాడ్ల ఏర్పాటు**
**ఫిర్యాదుల టోల్ ఫ్రీ నెంబర్ కోసం : 8008304495**

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**



పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం (పీడీఎస్) అక్రమ రవాణాను నివారించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టినట్టు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు చెప్పారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్లోని ఆయన చాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు 24 గంటలు పనిచేసేలా జిల్లాలో రెండు మొబైల్ ఫ్లైయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ ఫ్లైయింగ్ స్క్వాడ్ టీములో పోలీసు, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు ఉంటారని చెప్పారు. ఈ మొబైల్ ఫ్లైయింగ్ స్క్వాడ్లో రోజూ రెండు షిఫ్టుల్లో పని చేస్తాయని చెప్పారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒక స్క్వాడ్, సాయంత్రం 6 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు ఒక స్క్వాడ్ పని చేస్తుందని చెప్పారు. ఒక్కొక్క స్క్వాడ్

-మిగతా 2లో

## తిరుమల లడ్డుపై

# తప్పుడు ప్రచారాలు

**పోలీసులకు వైఎస్ఆర్‌సీపీ ఫిర్యాదు**




వివరాలు 2లో

పవిత్రమైన తిరుమల లడ్డుపై నిరాధార ఆరోపణలు పూర్తిగా అబద్ధమని సీబీఐ రిపోర్టు స్పష్టంగా తేల్చినప్పటికీ, కొంతమంది కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తూ అసత్యాలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

# వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీపీఆర్ నేత్ర వాహన వైద్య శిబిరాన్ని నల్లగొండ గ్రామంలో నిర్వహించారు. వీపీఆర్ ఫౌండేషన్ చీఫ్ కోఆర్డినేటర్ నేత్ర ప్రోగ్రాం అధికారి శంకర్ పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరానికి సుమారు 260 మంది నేత్రవ్యాధులు ఉన్నవారు హాజరయ్యారు. వారికి అధునాతన పరికరం ద్వారా పరీక్షలు జరిపి అవసరమైన కళ్ళజోలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీ వనిపెంట హైమావతి, మండల తెలుగు దేశం కన్వీనర్ గూడా నర్సారెడ్డి, సొసైటీ చైర్మన్ చల్ల వెంకటేశ్వర్లు యాదవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఈ ప్రాంతం మెట్ట ప్రాంతం అని, పేదరికంతో ఉందని ఉద్దేశంతో ఈ ప్రాంతవాసులు కంటి సమస్యలతో సతమతమవుతున్నారని గ్రహించి.. ఈ ప్రాంతవాసులకి కంటి వెలుగును ప్రసాదించాలన్న ఉద్దేశంతో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేదల సేవయే లక్ష్యంగా నేత్ర వాహనాన్ని సమకూర్చి ఉచితంగా కంటి సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల పేద ప్రజలకు కంటి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కొండపల్లి వెంకటేశ్వర నాయుడు, శ్రీనివాసులు నాయుడు, తిరుపతి ఆచారి, కోడూరు నాగిరెడ్డి, దిద్దిగుంట శ్రీనివాసులురెడ్డి, గాలి రామ్మోహన్ నాయుడు, అన్నపురెడ్డి తిరుపాల్రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## పైప్‌లైన్ పగిలి.. నీరు వృథా





**ఏఎస్ పేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం హసనాపురం పంచాయతీ పరిధిలోని జువ్వలగుంటపల్లి గ్రామంలో పంచాయతీ పైప్‌లైన్ పగలడంతో నెల రోజులు అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామస్తులు, పిల్లలు, పొలానికి వెళ్లే రైతులు ఆ దారిన వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నెలరోజుల నుంచి పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తులు గ్రామ నాయకుల ద్వారా తెలియజేసినా.. కార్యదర్శి పట్టించుకోవడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. గత నెల రోజుల నుంచి పైపు పగిలి నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో రోడ్డు అంత పాచిపెట్టి చిన్నపిల్లలు, వాహనదారులు సైతం జారి కింద పడిపోతున్నారని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులందరూ ఈ సమస్యను మండల పార్టీ అధ్యక్షుడు అబ్బూరి రమేష్ నాయుడు దృష్టికి తీసుకురావడంతో, ఆయన వెంటనే స్పందించి గ్రామానికి వెళ్లి పైపులైను లీకేజీ వద్ద జేసీబీతో సమస్యను పరిష్కార దిశగా చర్యలు చేపట్టారు. అలాగే స్థానిక ఎంపీడీవోతో సమస్యని తక్షణమే పరిష్కరించాలని కోరారు.

## పంచాయతీకి పన్నులు చెల్లించండి

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన ఇంటి పన్ను, కులాయి పన్ను, లైసెన్స్ ఫీజులు మొదలైనవన్నీ సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని పంచాయతీ అభివృద్ధి అధికారి రామారావు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు పంచాయతీలో బకాయిలు ఉన్న వారిని గుర్తించి ఒకటి రెండుసార్లు వారితో మాట్లాడి అప్పటికి చెల్లించని యెడల నోటీసు బోర్డులో వారి పేర్లు అందించబడతాయని తెలిపారు. అంతేకాకుండా కొళాయి కనెక్షన్, వారికి పంచాయతీ నుండి ఎలాంటి సేవలు అందించబడవన్నారు. ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్ను ఉపయోగించి మీరు చెల్లించాల్సిన పనులను మీ ఇంటి నుండే సులభంగా చెల్లించుకోవచ్చన్నారు. పంచాయతీ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం కూడా లేదన్నారు. మొండి బకాయిలు ఉన్న వారి ఎండ్ల వద్దకు పంచాయతీ సిబ్బంది దండోరా వేయించి డప్పులను మోగించి వారికి సమాచారాన్ని తెలియజేశారు. వినూత్నంగా చేసిన ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించి చెల్లించాల్సిన పనులను చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.

### పాత ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలి

**జలదంకి, మేజర్‌న్యూస్ :** జి రామ్‌జి చట్టాన్ని రద్దు చేస్తూ పాత ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని సిపిఎం నాయకులు తాళ్లూరు మాలాద్రి, రావి మాలాద్రిల ఆధ్వర్యంలో సోమవారం జలదంకి సచివాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. పాత చట్టం అమలు జరిపించుకునేందుకు ఉపాధి కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కొత్తగా పెట్టిన బడ్జెట్లో ఉపాధి హామీకి నిధులు పెంచకపోగా.. తగ్గించాలని కేంద్ర ప్రభుత్వ తీరును విమర్శించారు. కార్యక్రమంలో అంతోని బాబు, బత్తల నరసమ్మ, మస్తానమ్మ, కుట్టు బోయిన శ్రీనివాసులు పాల్గొన్నారు.

## తిరుమల లడ్డుపై తప్పుడు ప్రచారాలు : పోలీసులకు వైఎస్ఆర్‌సీపీ ఫిర్యాదు




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** పవిత్రమైన తిరుమల లడ్డుపై నిరాధార ఆరోపణలు పూర్తిగా అబద్ధమని సీబీఐ రిపోర్టు స్పష్టంగా తేల్చినప్పటికీ, కొంతమంది కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తూ అసత్యాలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎస్ఆర్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకట శేషయ్య, మండల ఉపాధ్యక్షుడు కనుపూరు కోదండరామిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెంకటాచలం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారికి ఫిర్యాదు చేశారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిని గుర్తించి విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా వెంకట శేషయ్య మాట్లాడుతూ, తిరుమల లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వు, పంది కొవ్వు కలిసిందని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమన్నారు. దీనిపై సీబీఐ సమగ్ర విచారణ జరిపి ఎలాంటి కల్తీ జరగలేదని స్పష్టం చేసిందని తెలిపారు. నిజం ప్రజలకు తెలిసిన తరువాత కూడా కావాలనే రెచ్చగొట్టే విధంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఫోటోలతో బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. భక్తుల మనోభావాలతో ఆడుకున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్ని కుట్రలు చేసినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ఏమీ చేయలేరని, పార్టీపై బురద చల్లే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని వెంకట శేషయ్య పేర్కొన్నారు.

## కిటకిటలాడిన కలెక్టరేట్



*(మొదటి పేజీ తరువాయి)*

వివరించాలన్నారు. ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను బియాండ్ యస్‌యల్‌ఏ పోకుండా చూడాలని అధికారులకు సూచించారు. రేపు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా అధికారులతో శాసనసభ అంచనాల కమిటీ సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో అవసరమైన రికార్డులను సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లును జిల్లా అధికారులు చేపట్టారు. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతపాటు షామియానాలు వేసి నీడను కల్పించారు. సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నూతనంగా ఫిర్యాదుల స్వీకరణ త్వరితగతిన పరిష్కారానికి డివిజనుల వారీగా రెవెన్యూ క్లినిక్ ప్రత్యేక కౌంటర్లను తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసి అర్జీల సత్వర పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. మొత్తం 640 రాగా వీటిలో రెవెన్యూకి సంబంధించి 275 పైచిలుకు అర్జీలు వచ్చినట్లు తెలిసింది. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం ఆక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

*(మొదటి పేజీ తరువాయి)*

టీములో ఆరుగురు సభ్యులు ఉంటారని చెప్పారు. వీరితో పాటుగా ఆక్రమ రవాణా ఆడుకునేందుకు ప్రజల నుంచి సమాచార సేకరణ కోసం టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశామని చెప్పారు. టోల్ ఫ్రీ నెంబరు 8008304495గా పేర్కొన్నారు. ప్రజలు ఏ క్షణమైనా ఈ నంబరుకు ఫోన్ చేసి రేషన్ బియ్యం ఆక్రమ రవాణా వివరాలు చెప్పవచ్చన్నారు. డీలర్లు కొందరు డబ్బులు ఇచ్చి, బియ్యం కార్డుదారులకు ఇవ్వటం లేదని, దీనిపై ఏంచర్యలు తీసుకుంటారని జేసీని విలేకరులు ప్రశ్నించగా, అలాంటి ఫిర్యాదులందితే కఠిన చర్యలు చేపడతామని తెలిపారు.

## సోమశిల ప్రాజెక్టు చైర్మన్‌ను కలిసిన ఏపీఎన్జీవోస్ నాయకులు



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవ చౌదరిని ఏపీ ఎన్జీవోస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఏపీఎన్జీవోస్ డైరీ, క్యాలెండర్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ లక్కాకుల పెంచలయ్య, ఏపీ ఎన్జీవో సిటీ యూనియన్ కార్యదర్శి ఏవి కృష్ణ కుమార్, సిటీ జాయింట్ సెక్రెటరీ చెంచయ్య, రాధాకృష్ణ, గొలగమూడి రమేష్ బాబు, మధుసూదన్, సతీష్, ఇరిగేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ లక్ష్మీ స్వరూపకు అభినందనలు

### పోలీస్ స్పోర్ట్స్‌లో నాలుగు మెడల్స్



**మనుబోలు, మేజర్‌న్యూస్ :** మనుబోలు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళ పోలీస్ లక్ష్మి పోలీస్ స్పోర్ట్స్‌లో నాలుగు మెడల్స్ సాధించింది. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో పోలీసులు, ఏఎస్ఐలు అభినందించారు. నెల్లూరులో జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ స్పోర్ట్స్ మీట్లో నాలుగు మెడల్స్ సాధించి, మనుబోలు పోలీస్ స్టేషన్‌కు జిల్లాస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన లక్ష్మిని ఎస్సై శివ రాకేష్ అభినందించారు.

# రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

## పోలీసులకు వైసిపినేతల వినతిపత్రం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆత్మకూరుకు చెందిన వైసిపి నేతలు పేర్కొన్నారు. వారు సోమవారం స్తానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ ఎస్.సాయిప్రసాద్‌కు ఒక వినతిపత్రం అందజేశారు. పట్టణ వైసిపి అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో జిల్లా వైసిపి అధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి మెంబర్ డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య పాల్గొని శాంతిభద్రతల పరిస్థితిని గురించి పోలీసులకు వివరించారు. వైసిపికి చెందిన సీనియర్ నాయకుల ఇళ్ళపై వ్యక్తిగతంగా దాడులు పెరిగాయని, భయానక వాతావరణం సృష్టించేలా కూటమి శ్రేణులు వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. కల్తీనెయ్యి కేసులో వైసిపి నేతలపై దుష్ప్రచారాలు చేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. వైసిపి నాయకులను టార్గెట్ చేస్తూ దాడులు చేస్తున్నారని ప్రతాప్‌రెడ్డి, ఆదిశేషయ్యలు పేర్కొన్నారు. మాజీ మంత్రులు విడదల రజిని, అంబటిరాంబాబు, జోగి రమేష్‌ల ఇళ్ళపై టిడిపి మూకలు బహిరంగంగా దాడులకు దిగారని, వారి నివాసాలపై పెట్రోల్ బాంబులు వేసి నానా భీభత్సం సృష్టించారన్నారు. అంబటి రాంబాబుపై హత్యాయత్నానికి పాల్పడ్డారని వారు పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఇలాంటి సంస్కృతి లేదని, దాంతో టిడిపి వారు ప్రశాంతంగా ప్రచారాలు చేసుకున్న మాటమరిచారా అన్ని ప్రశ్నించారు. అసత్య ఆరోపణలు చేసిన కల్తీనెయ్యి విషయంలో ఎలాంటి క్రొవ్వుపధార్థాలు లేవని సుప్రీమ్‌కోర్డు నియమించిన సిట్ నివేదికలో పూఏర్కొనగా ఓర్వలేని కూటమి నాయకులు డైవర్షన్‌పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని వారు విమర్శించారు. 2024లో సిఎం చంద్రబాబునాయుడు శ్రీవెంకటేశ్వరస్వామి ప్రసాదమైన లడ్డు తయారిపై అబాంధాలు వేస్తే వైసిపి నాయకులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారని వారు పేర్కొన్నారు. అప్పటినుండి రాష్ట్రంలో రావణకాష్టం రగులుకుందన్నారు. ఇకనైనా ప్రజలిచ్చిన అవకాశం మేరకు సుపరిపాలన సాగించాలని, దాడులకు పాల్పడవద్దని వారు టిడిపి శ్రేణులకు హితవు పలికారు. ఈకార్యక్రమంలో మర్రిపాడు, అనంతసాగరం, సంగం మండలాల వైసిపి అధ్యక్షులు చెన్ను వెంకటేశ్వరరెడ్డి, బిజివేముల పిచ్చిరెడ్డి, పులగం శంకర్‌రెడ్డి, నియోజకవర్గ వైసిపి పంచాయతీరాజ్‌విభాగం అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, వైసిపి ఎస్‌సిసెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, బి.చిరువెళ్ళ సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు అంద్రా సుబ్బారెడ్డి, షేక్ మీరామొహిద్దీన్, ఇందూరు సురేంద్రరెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, గడ్డం శ్రీనివాసులురెడ్డి, బత్తిన నారాయణరెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, పాలేటి వెంగల్‌రెడ్డి, బాలచెన్నయ్య, షారూక్, ఖాజావలి, ఖాజామస్తాన్, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి లక్ష్యంగా.. జలదంకి పంచాయతీ



**జలదంకి, మేజర్‌న్యూస్ :** అభివృద్ధి లక్ష్యంగా జలదంకి పంచాయతీ ఉపసర్పంచ్ మాల కొండరెడ్డి ఆధ్వర్యంలో దూసుకు పోతోంది. ఇటీవల పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణం, పంచాయతీ తాగునీటి కోసం ఇంటింటికి కులాయి ఉండే విధంగా ప్రతి చిన్న బజారుకు కూడా పైప్ లైన్లు వేస్తున్నారు. సోమవారం జలదంకి పంచాయతీ పరిధిలోని అప్పారావు తోట గిరిజన కాలనీలో 10లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాలకొండ రెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాలతో జలదంకి పంచాయతీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే కాక, మౌలికవసతుల కొరత లేకుండా ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికే చిన్న చిన్న వీధులకు కూడా పైప్ లైన్లను వేయడం జరిగిందని, ప్రతి ఇంటికి ప్రతి కుటుంబానికి తాగునీటి కొరత లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మహేష్, పల్లవి, అప్పారావు తోట గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్‌ఎంసీ చైర్మన్ చొరవతో పాఠశాలలలో మార్పులు



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం మంచాలపల్లిలోని జంగాల కాలనీ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎంసి చైర్మన్ కొమ్మూరు అంజయ్య చొరవతో మార్పులు చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు బత్రెడ్డి లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బత్రెడ్డి లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. పాఠశాలలోని నిరుప యోగంగా పాత మరుగుదొడ్లు మార్చి ఫ్లోరింగ్ చేయించి తలుపులు పెట్టి కిచెన్, స్టోర్ రూమ్‌గా మార్పు చేసి ఉపాధ్యాయులకు స్టాఫ్ రూమ్ ఏర్పాటు చేశారన్నారు. చేతుల పరిశుభ్రతకు నీరు బయటకు రాకుండా నాలుగడుగుల గుంత త్రవ్వించి సిమెంటు ఓరలతో మూసి బురద లేకుండా చేశారని అన్నారు. తక్కువ ఎత్తు కలిగి రెండు చోట్ల దారులు గల ప్రహరీ గోడకు ఉపాధ్యాయులు అందించిన 15000 రూపాయలు ఆర్థిక సహాయంతో దారులు మూయించి మూడు అడుగులు ఎత్తు పెంచి పటిష్ట భద్రత కల్పించారన్నారు. తక్కువ ఎత్తు కలిగిన పాఠశాల నేమ్ బోర్డు మరో నాలుగు అడుగులు పైకి పెంచి కాంక్రీట్ వేయించారన్నారు. బాధ్యత వహించి సొంత నిధులు ఉపయోగించి కావలసిన విధంగా మార్పు చేయడంలో చొరవ చూపి ఆదర్శంగా నిలిచిన పాఠశాల తల్లి దండ్రుల కమిటీ చైర్మన్ కొమ్ములూరు అంజయ్యకు పాఠశాల విద్యార్థుల, ఉపాధ్యాయుల ఘనంగా సన్మానించి ధన్యవాదాలు ఆమె వివరించారు.

# నూరు శాతం ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

● సకల వసతుల కల్పనతో నాణ్యమైన విద్యా బోధన ● ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షణ ● మొత్తం విద్యార్థునుల సంఖ్య 192 ● ప్రిన్సిపాల్ మేరీ ప్రియత



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ఏపీ గిరిజన బాలికల గురుకుల పాఠశాల ప్రస్థానాన్ని ప్రభుత్వ ప్రోత్సాహం.. ఉన్నతాధికారుల సహకారంతో నూరు శాతం ఉత్తమ ఫలితాల సాధన దిశగా ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ప్రిన్సిపాల్ మేరీ ప్రియత పేర్కొన్నారు. సోమవారం స్థానిక పొదలకూరు రోడ్డులో ఉన్న గిరిజన బాలికల గురుకులంలోని అధ్యాపకుల బృందంతో సమావేశం నిర్వహించిన ప్రిన్సిపాల్ మేరీ ప్రియత మాట్లాడుతూ.. 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న. బాలికల సంఖ్య మొత్తం 192 ఉందని, అందులో ఈ ఏడాది 27 మంది 10వ తరగతి పరీక్షలకు హాజరు హాజరుకానున్నారని తెలిపారు. గిరిజన బాలికల గురుకుల పాఠశాలకు కూడా పూర్తిస్థాయిలో రెగ్యులర్ టీచర్స్ నియమించబడి నందున వంద శాతం ఉత్తమ ఫలితాలు సాధన లక్ష్యంగా ఎంచుకొని అందుకనుగుణంగా తమకు కేటాయించిన సబ్జెక్టుల వారిగా పాఠ్యాంశాల్లో చక్కటి విద్యా బోధన అందిస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం గిరిజన బాలికల వసతి గృహ నిర్వహణకు సంబంధించి పర్యవేక్షణ, నిర్వహణలపై అజమాయిషీ బాధ్యత ప్రిన్సిపాల్‌పై ఉన్నప్పటికీ.. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులకు 3నెలలు చొప్పున కాల పరిమితితో పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. వసతి, భోజనం, అల్పాహారం, ఇతర స్నాక్స్ నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడే ప్రసక్తే ఉండదన్నారు. 10వ తరగతిలో విద్యార్థులలో చదువులో వెనుకబడి ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక స్టడీ అవర్స్ ద్వారా అర్థమయ్యే రీతిలో బోధించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం, సాహోద్యోగులైన అధ్యాపక బృందం సహకారపు భాగస్వామ్యాలతో నూరు శాతం ప్రభుత్వ నిర్దేశిత ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయునీల బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మర్రిపాడు తహసిల్దారుకు ఘన సన్మానం



**మర్రిపాడు, మేజర్ న్యూస్ :** మర్రిపాడు మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌గా మండల ప్రజలకు సమర్థవంతమైన సేవలను అందిస్తున్న తహసీల్దార్ అనిల్ కుమార్ యాదవ్‌ను జిల్లా పెద్దలు ఆయన సమర్థతను సేవలను గుర్తించి ఉత్తమ సేవ అవార్డుకు ఎంపిక చేసి ఘనతంత్ర దినోత్సవం రోజు జిల్లా కలెక్టర్ ప్రశంశించడం అభినందనీయమని తహసీల్దార్ సమర్థతకు సముచిత పురస్కారం దక్కిందని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అంశాల పట్ల సానుకూలంగా స్పందిస్తూ ప్రజల నుంచి వచ్చే సమస్యలు మండల స్థాయిలో పరిష్కారం కావాల్సిందేననే ధీమా సుస్పష్టంగా తహసీల్దార్ పనితనంలో కనిపించడం దేవుడు ఆయనకి ఇచ్చిన ఆభరణం. సమస్యలపై ముఖ్యంగా భూ సమస్యల పట్ల క్షుణ్ణంగా క్షేత్ర స్థాయిలో విచారణ చేసి వివాదాలను సద్దుమానిగేలా చేస్తూ వివాదరహితుడిగా గుర్తింపు తెచ్చుకోవడం మండల ప్రజలు ఆయనకు ఇచ్చిన బహుమానం. మండల గ్రామాల్లో సంభవించే విపత్తులు, ఇతర సమస్యలను ముందుగా గుర్తించేలా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయం చూపించడం. గ్రామస్థాయి సమాచారం పక్కాగా సేకరించి, ప్రజలు జీవన విధానాలను అవలోకణం చేసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంతరాయం లేకుండా పేదలకు అందడంలో సపలీకృతులయ్యారు. మండలంలోని బ్రాహ్మణోత్తములు సమూహంగా వచ్చి ఉత్తమ సేవ అవార్డు గ్రహీత తాహసిల్దార్ అనిల్ కుమార్ యాదవ్‌ను ఆశీర్వదించడం గమనార్హం. తహసీల్దార్ విధి విధానాలను గుర్తించిన జిల్లా అధికారఘనం ఉత్తమ సేవ పురస్కారానికి ఎంపిక చేయడం అభినందనీయమని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ఈద్గామిట్ట ప్రాంతంలో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక శివాలయంలో అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న బద్దెపూడి అనిల్ శర్మ, గాయత్రీ దంపతులు ఈద్గామిట్టలో గత కొన్నేళ్ళుగా అద్దెకు ఉంటున్నారు. ఇటీవల వారి మధ్య కుటుంబ కలహాలు ఏర్పాడ్డాయి. ఈ తరుణంలో సోమవారం పాఠశాలకు వెళ్లిన పిల్లలకు గాయత్రీ భోజనం పెట్టి తిరిగి ఇంటికొచ్చింది. పాఠశాల నుంచి ఇంటికొచ్చిన పిల్లలు ఇంట్లో ఎవరూ లేకపోవడం, తలుపులు వేసి ఉండడంతో స్థానికుల సహాయంతో ఆలయంలో ఉన్న తండ్రి అనిలశర్మకు సమాచారం ఇచ్చారు. అతను ఇంటికొచ్చి చూడగా తలుపుకు లోపల గడియ వేసి ఉండడంతో గట్టిగా తన్ని తొలగించాడు. గాయత్రీ గదిలో ఉరి వేసుకుని ఉండడంతో హుటాహుటిన కిందకు దించి 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతిచెందినట్లు గుర్తించి మృతిరాలికి ఇద్దరు ఆడపిల్లలు. ఆమె మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వైద్యశాలకు చేరుకుని వివరాలు సేకరించారు.

# సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని దిలావర్భయివీధిలో సిమెంట్ రోడ్డు పనులను టీడీపీ నాయకులతో కలిసి సోమవారం టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పట్టణంలోని పలు ప్రాంతాలకు రూ.1.78 కోట్లతో సిమెంట్రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. అందులో భాగంగా దిలావర్భయ్యవీధిలో రూ.14 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడం జరిగిం దన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమ ంలో పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరాజు, టీడీపీ నాయ కులు అలీ, ఖాలీద్, అఖిల్, దావూర్‌అహ్మద్, నాతిక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దారు ఎల్.రామ్మోహన్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. వచ్చిన అర్జీలను సకాలంలో పరిశీలించి న్యాయం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పలువురు వివిధ సమస్యలపై ఏడు అర్జీలు అం దజేశారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలకు ఓరియంటేషన్ కార్యక్రమం

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ఐసీడీఎస్ ప్రాజెక్టు నెల్లూరు కార్యాలయం నందు వైకల్యం ఉన్న వ్యక్తుల నైపుణ్యాభివృద్ధి, పునరావాసం, సాధికారత కోసం కాంపోజిట్ రీజినల్ సెంటర్ సిఆర్ఎస్ నెల్లూరు (ఎన్ఐఈపిఐడి సికింద్రాబాద్, డిఈపిడబ్ల్యూడి, ఎంఎస్‌జెడ్ఈ భారత ప్రభుత్వం యొక్క పరిపాలనా నియంత్రణలో ఉంది) 2026 ఫిబ్రవరి 2న చగనం లలితమ్మ భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో నెల్లూరులో అంగన్‌వాడీ కార్యకర్తలకు వైకల్యాలను ముందస్తుగా గుర్తించడంపై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యక్రమాలు, పథకాలు, పిడబ్ల్యూడి, సిఆర్‌సి నెల్లూరు ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అలాగే వైకల్యాలను ముందస్తుగా గుర్తించడంపై అంగన్‌వాడీ టీచర్లకు ఓరియంటేషన్ ఇవ్వబడింది. ఈ కార్యక్రమంలో నెల్లూరులోని అంగన్‌వాడీ టీచర్లకు ముందస్తు గుర్తింపు కిట్‌లను పంపిణీ చేశారు. డిఈడి ఎస్‌పిఎల్(హెచ్ఐ) డిఐఎస్ఎల్ఐ విద్యార్థులతోపాటు దాదాపు 350మంది లబ్ధిదారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ



కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎస్‌పి డైరెక్టర్ సిఎస్‌సి మనోజ్‌కుమార్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనా సూజన్, నెల్లూరు సిడిపిఓ టి.అరుణ, పీడీ మోదర్, సిడిఇఐసి ప్రత్యేక విద్యావేత్త, టి.రాకేష్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లతోపాటు క్లినికల్ అసిస్టెంట్ రిసోర్స్ పర్సన్‌లుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని పునరావాస అధికారి కె.ప్రవీణ్ కుమార్, క్లినికల్ అసిస్టెంట్ టి.రాకేష్ నిర్వహించడం జరిగింది.

# అన్య మత పార్థన మందిరాలను తొలగించండి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** సహహస్ర లింగ్రేశ్వర స్వామి (ఆగస్త్య ముని తపస్సు చేసిన సమయంలో తన రుద్రాక్ష భూమిపై పడి శివలింగంగా మారిన పవిత్రమైన ప్రాంతం గూడలి. అలాంటి దేవాలయ భూమిలో అన్య మత ప్రార్థన మందిరాలు ఎలా నిర్మిస్తారంటు సోమవారం బీజేపీ –శివశక్తి హిందు చైతన్య వేదిక. బజరంగ్దళ్ సభ్యులు బార్కస్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు మిడతల రమేష్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడో ఒక చోట హిందూ ధర్మం పై దాడి జరుగుతూనే ఉందని మండి పడ్డారు, నెల్లూరు జిల్లా కోట మండలం గూడలిలో ఇప్పటికే మూడు అన్య మత ప్రార్థన మందిరాలు ఉన్నయ్యని మరో మెగా మందిరం నిర్మిస్తున్నారని తెలిపారు. హిందూ ధర్మం ఆచరిస్తున్న దళిత కుటుంబాలపై అన్యమతస్తులు రాత్రి సమయంలో రాళ్లు రువ్వుతూ దాడులు చేస్తున్నారని గ్రామానికి చెందిన దళిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకురాలు కంది కట్ల రాజేశ్వరి మాట్లాడుతూ.. గూడాలి గ్రామంలో ఇంత అన్యాయం జరిగితుంటే హిందూ సంస్థల స్థలాలను కాపాడాల్సిన దేవాదాయ శాఖ ఏమి చేస్తుందని ప్రశ్నించారు బీజేపీ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి గ్రామంలో జరుతున్న అన్య మత ప్రార్థన మందిరాలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత పొట్లూరు శ్రీనివాసులు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గంటా విజయశ్రీ మూలపేట మండలాధ్యక్షురాలు సిహెచ్, పద్మావతి, బాలాజీనగర్ మండలాధ్యక్షుడు మింగాకిరణ్ కుమార్, శివశక్తి నాయకులు యస్, పెంచల బాబూ, పాండు రంగారెడ్డి, హిందూ చైతన్య వేదిక నాయకులు పిజి మహేష్, కాకు మురళీరెడ్డి విశ్వహిందు పరిషత్ నాయకులు ఏవి రాజేంద్ర ప్రసాద్, నీలిశెట్టి లక్ష్మణరావు. ఆలూరు నాగేంద్ర సింగ్, కేశవ, మునగ సుబ్బారావు,వల్లూరు సుబ్బారావు, భజరంగ్ దళ్ నాయకుడు, కే.సుధాకర్ గూడాలి గ్రామస్తులు పాలొగొన్నారు. తదుపరి కలెక్టర్ కు పిర్యాదు చేశారు.

# సీసీ రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ స్థానిక 52వ డివిజన్ రంగనాయకులపేట ప్రాంతంలో రథం మండపం ప్రాంతం నుంచి బాల తిమ్మయ్య కళ్యాణమండపం వరకు ఎండ్ టూ ఎండ్ సిసి రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానగరాలలోని మౌలిక వసతులను ఆదర్శంగా తీసుకుని నెల్లూరు నగర వ్యాప్తంగా సిసి రోడ్ల నిర్మాణ పనులను చేపట్టి నిర్దేశించిన సమయానికి పూర్తయ్యేలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా డివిజన్ పరిధిలోని రంగనాయకులపేట ప్రధాన మార్గంలో కూడా రోడ్డు ప్యాచ్ వర్క్ పనులకు టెండర్లను పిలిచి పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ నిర్దేశాల మేరకు జూలై 12 నాటికి నగర వ్యాప్తంగా డ్రైను కాలువలు, రోడ్ల



నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ వీధి దీపాలు, పార్కులు తదితర అన్ని మౌలిక వసతులను ప్రజలకు అందించేలా ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని మేయర్ ప్రకటించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, టిడిపి నాయకులు, నెల్లూరు నగరపాలకు సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కేంద్ర బడ్జెట్‌లో చేనేతలకు నిరాశ

## వైసీపీ చేనేత విభాగం నాయకుల మండిపాటు

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ చేనేత, పవర్ లూమ్ రంగాలకు చెందిన కార్మికులను తీవ్ర నిరాశకు గురిచేసిందని వైయస్‌ఆర్సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి కోనం బ్రహ్మయ్య, సర్వేపల్లి నియోజకవర్గం చేనేత విభాగం అధ్యక్షులు పముజుల శంకరయ్యలు పేర్కొన్నారు. పొదలకూరులో సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు గణాంకాలు చూపిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో సామాన్య నేత కార్మికుడికి నేరుగా ఉపయోగపడే స్పష్టమైన నిర్ణయాలు ఈ బడ్జెట్‌లో లేవని తెలిపారు. జీరో జీఎస్టీ లేదు, నేత బజార్లు లేవన్నారు. కేవలం 200 కోట్లు కేటాయించారని చేనేత అయినా, పవర్ లూమ్ అయినా యార్న్ (నూలు), పత్తి, రంగులు, కెమికల్స్ వంటి ముడి సరుకుల ధరలు జీఎస్టీ భారం వల్ల భారీగా పెరిగిపోయాయని అన్నారు. ముడి సరుకులపై జీరో జీఎస్టీ అమలు చేయకుండా ఈ రంగాలు నిలబడడం అసాధ్యం అయినప్పటికీ, ఏళ్లుగా కార్మికులు కోరుతున్న ఈ డిమాండ్‌ను కేంద్ర బడ్జెట్ పూర్తిగా విస్మరించిందన్నారు. మగ్గం ఏదైనా, నేసే కార్మికుడి సమస్య ఒకటేనని బడ్జెట్‌లో మహిళా కార్మికులకు ప్రత్యేక పథకాలు, వృద్ధ కార్మికులకు పెన్షన్, ప్రమాద భీమా, కనీస ఆదాయ భరోసా వంటి సామాజిక భద్రతా అంశాలను పూర్తిగా పక్కన పెట్టారని మండి పడ్డారు. ముడి సరుకులపై తక్షణమే జీరో జీఎస్టీ అమలు చేయాలని, చేనేతకు ప్రత్యేక నేత బజార్లు, పవర్ లూమ్‌కు టెక్స్టైల్ మార్కెట్లు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా చల్లా కౌశిక్ యాదవ్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నెల్లూరు జిల్లా, వింజమూరు మండలం బొమ్మరాజు గ్రామానికి చెందిన చల్లా కౌశిక్ యాదవ్‌ని రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. గతంలో కౌశిక్ ఏబీవీపీలో రాష్ట్ర కార్యదర్శి పనిచేశారు. అంతేకాకుండా ఏబీవీపీ రాష్ట్రంలోని, గతంలో ఆంధ్రప్రదేశ్లో విద్యార్థి సమస్యల పట్ల అనేక ఉద్యమాలు నిర్వహించారు. వారి పోరాట పటిమ, సంస్థపట్ల ఉన్న అంకితభావం, సమస్యల పట్ల ఉన్న నిషితమైన పరిశీలన వారి దూర దృష్టి కారణంగా అనేకమైన విద్యార్థి సమస్యల పరిష్కారం వైపు అడుగులు వేశారు. ఈయన బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ఎన్నికల పట్ల బీజేవైఎం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కౌశిక్ యాదవ్ మాట్లాడుతూ.. బిజెపి యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు అప్పగించినందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌కి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సునీల్‌కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ కొత్త బాధ్యతను పూర్తి అంకితభావంతో నిర్వర్తిస్తూ, రాష్ట్రంలో పార్టీ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లేందుకు అచంచలంగా కట్టుబడి ఉంటాను అని తెలిపారు.

# బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుత్తా అశోక్ నాయుడు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నెల్లూరు నగరం కిసాన్ నగర్‌కు చెందిన గుత్తా అశోక్ నాయుడుని నియమిస్తూ భారతీయ జనతా పార్టీ నియామకం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు గుత్తా అశోక్‌నాయుడు మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి నాకు ఈ బాధ్యతను అప్పగించిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డికి, రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌కి అదేవిధంగా రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్‌కి, నెల్లూరు జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పార్టీ సిద్ధాంతాలు కట్టుబడి వివిధ సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తానని, రాష్ట్ర నలుమూలల శక్తి మేరకు విస్తృతంగా పర్యటన చేసి యువతను పార్టీలో చేర్చుకొని నూతన నాయకత్వాన్ని పెంచేందుకు కృషి చేస్తానని తెలియజేశారు.

# కౌలు రైతుల సంగం మండల కమిటీ సమావేశం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాలెంలో సోమవారం కౌలు రైతుల సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. రైతుల సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేది కలెక్టర్ ఆఫీస్ వద్ద నిరసన దీక్షలు రెండు రోజులపాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని క్వింటా ధాన్యానికి మద్దతు ధర 3000 రూపాయలు ఇవ్వాలని, కౌలు రైతు సంఘం మండల కమిటీ తీర్మానించి కౌలు రైతులకు అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వడ్డీ లేని రుణం కౌలు రైతులందరికీ ఇవ్వాలని, యూరియా ప్రతి ఒక్కరికి అందించాలని కౌలురైతు మండల కమిటీలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం అధ్యక్షులు ముత్యాల గురునాథం, సహాయ కార్యదర్శి పొట్టేపాలెం చంద్రమౌళి, రైతు సంఘం అధ్యక్షులు పూడిపర్తి జనార్దన్, మండల కమిటీ సభ్యులు, నాయకులు వెంకటరమణయ్య, ఎడవల్లి రమణయ్య, జడ వెంకటేశ్వర్లు, పి.నాగరాజు, అట్లా అనిల్, అట్లా అంజయ్య, పాదర్తి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని తిరిగి పునరుద్ధించాలి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 30వ డివిజన్ కొత్తూరు శేఖ ఆధ్వర్యంలో వైయస్సార్ నగర్ సచివాలయం వద్ద మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తిరిగి పునరుద్ధించాలని పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని, రద్దు చేసిన కార్మిక చట్టాలను తిరిగి పునరుద్ధించాలని కోరుతూ ప్రజల చేత సంతకాలు చేయించి వైయస్సార్ నగర్ సచివాలయం అడ్మిన్ (కార్యదర్శి)కి అర్జీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి కండె కోటేశ్వరరావు శాఖ సభ్యులు ఎస్‌డి హమీద్, వెంకట రమణయ్య, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ మార్క్ అంతర్జాతీయ స్థాయి బడ్జెట్ : బీజేపీ నాయకులు

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయం రామ్మూర్తి నగర్‌లో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ఎస్.వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో నరేంద్ర మోడీ మార్కు కొట్టొచ్చినట్లు కనిపించింది అన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి వేలాది కోట్ల రూపాయలు కేటాయించడం అలాగే రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు నిధులు కేటాయించడం రాష్ట్రంలోని అన్ని నగరపాలక మున్సిపాలిటీలకు వాటి అభివృద్ధికి ఘననీయమైన నిధులను ఏర్పాటు చేయడంలింకు రోడ్లు కాలువలు మురుగు కాలువలు అభివృద్ధి పరిచే దానికి నిధులను మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సంవత్సరిక బడ్జెట్లో రాష్ట్రానికి సంబంధించిన అనేక పెండింగ్ ప్రాజెక్టులతోపాటు కొత్త ప్రాజెక్టులకు విరివిగా కేటాయింపులు చేయడం జరిగిందని ఇది చాలా శుభ పరిణామం అన్నారు. అనంతరం బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వాకాటి. నారాయణరెడ్డి మాట్లాడుతూ.. భారత ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 9వసారి కేంద్ర బడ్జెట్ను ప్రవేశ పెట్టడం జరిగిందని 53లక్షల 47 వేల 315 కోట్ల రూపాయలతో ప్రపంచ స్థాయి బడ్జెట్ అంచనాలతో దీనిని రూపొందించారన్నారు. ఇది సుమారు ఐదు ట్రిలియన్ డాలర్స్‌తో సమానమని ఇది పూర్తిగా ఆత్మ నిర్భరభారతాన్ని పరిగణంలోకి తీసుకొని తయారుచేసిన బడ్జెట్ అన్నారు. స్వదేశీ వస్తువుల రూపకల్పన పెట్టుబడుల మీద అధికంగా కేంద్రీకృతం చేసిన బడ్జెట్ని గుండుసూది నుంచి విమానం వరకు భారత్‌లోనే తయారు చేయాలన్న సంకల్పంతో అలాగే ఆంధ్ర రాష్ట్రానికి పోలవరానికి నిధులు 3,320 కోట్లతో ఆంధ్ర రాజధాని అమరావతికి నిధులు 1,561 కోట్లతో సెమీ కండక్టర్ 2.0 ప్రమాణాలతో తయారీకి 40వేల కోట్లతో రక్షణ రంగానికి 15శాతం అదనపు నిధులతో 1,75,730 కోట్ల రూపాయలతో కొత్త పన్నుల భారం ప్రజల మీద వేయకుండా 2,047 వరకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ డేటా సెంటర్ లకు జీరో టాక్స్ తో డేటా సెంటర్లను దేశంలో, రాష్ట్రంలో అధికంగా ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ధ్యేయంతో కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు. దేశంలోనే నూతన పారిశ్రామిక విప్లవానికి నాంది పలికి పారిశ్రామిక కారిడాల ఏర్పాటు విద్య, వృత్తి నైపుణ్యాల కొరకు ఐదు నూతన యూనివర్సిటీలు అలాగే మెడికల్ హబ్ ఏర్పాటు నూతనంగా బయోపార్కుల నిర్మాణం వ్యవసాయ రంగంలో కొబ్బరి, కోకో అధిక ప్రోత్సాహం మరియు విస్తృత స్థాయిలో మొక్కలు పంపిణీ తీర ప్రాంతానికి సదావకాశమన్నారు. అలాగే మత్స్యకారులకు ప్రోత్సాహం ఇస్తూ ప్రాసెసింగ్ ప్లాంట్ల ద్వారా నాణ్యమైన మత్స్య ఎగుమతులకు దీనికి కావలసిన బోట్లు పరికరాలు దేశంలోనే తయారు చేస్తారన్నారు. జిల్లాకు ఒక మహిళ హాస్టల్ ఏర్పడనుందన్నారు. దేశంలో ఏడు, రాష్ట్రంలో మూడు నూతన బుల్లెట్ రైలు కారిడార్లు ఏర్పడతాయన్నారు. అలాగే కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జాతీయ రహదారుల విస్తరణ పెద్దపెద్ద వంతెనల ఆధునీకరణ ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్లు, రైలు మార్గాలు, విమాన మార్గాలు తక్షణమే అభివృద్ధి చేస్తారని 17 రకాల క్యాన్సర్ ఔషధాలు ప్రత్యేక ఔషధాలు అరుదైన చికిత్సలకు ధరలు తగ్గిస్తారని విమానా తయారీ రంగానికి



ఉపయోగపడే ఇంజన్లు విడిభాగాలను సోనార్ ప్యాలెస్ తయారు చేసే ముడి పదార్థాలు, అను విద్యుత్ తయారీకి ఉపయోగపడే పరికరాలు, ఖనిజాల వెలికితీతకు ఉపయోగపడే భారీ యంత్రాలు, పరికరాలు, తోలు వస్తువులు, జోలు వస్తువులు తయారీకి విదేశీ విద్యకు పెద్దపీట వేసింది అని వాటిపై పన్నులు తగ్గింపు తదితరాలు ముఖ్యంగా ఉన్నాయన్నారు. కాపీ రోస్టింగ్ యంత్రాలు, వెండింగ్ యంత్రాలు, విదేశీ బ్రాండెడ్ బ్రాడ్ కాస్టింగ్, ఏటీఎం యంత్రాలకు అవసరమైన విడిభాగాలు రక్షణ వ్యవస్థల్లో దేశ భద్రత కావలసిన విమానాల తయారీకి, డ్రోన్లు తయారీకి, మిస్సైల్స్ తయారీకి అధికంగా ధనాన్ని వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ముక్కు. రాధాకృష్ణ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం. విజయ్ కుమార్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.సి. పెంచలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ మాల్యాద్రి, జిల్లా కార్యదర్శి ఎం.రత్నం నాయుడు బీజేవైఎం జోనలించార్జ్ లెక్కల రాజశేఖర్ రెడ్డి, ఇతర అనుబంధ సంఘాలు, నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చంద్రన్న విద్యుత్ వెలుగులు, సీసీ రోడ్డును ప్రారంభం

**టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి**

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కాకుపల్లి గ్రామంలో 1.45 కోట్ల రూపాయల వ్యయంతో చంద్రన్న విద్యుత్ వెలుగులు త్రీఫేస్ కరెంట్ పనులు, సి.సి.రోడ్డు పనులను టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, గ్రామ సర్పంచ్ కోసూరు సుభాషిణి ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో 370కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధిపనులు జరుగుతున్నాయని తెలియజేశారు. అదేవిధంగా మాటకు కట్టుబడివుండే మంచి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం. ప్రజలకు ఏ సమస్య ఉన్నా తోడుగా, అండగా ఉంటామని తెలిపారు. ఇటీవల మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 26 డివిజన్లలో 27 కోట్ల రూపాయలతో 240 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. 60 రోజుల్లో ఆ పనులన్నీ పూర్తిచేసి, ప్రజలకు అందించడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి అభివృద్ధి, సంక్షేమం రెండూ రెండు కళ్ళలా భావించి పనిచేస్తున్నాము. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహాయ సహకారాలతో ఎన్నడూ లేని విధంగా రూరల్ శాసనసభ్యులు శ్రీధర్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు



నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామ నారాయణ రెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, నెల్లూరు ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ అల్లాబక్షు, ఉప సర్పంచ్ సాల్మన్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జ్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ సారంగం గున్నయ్య, కో క్లస్టర్ ఇంచార్జ్ కాకుపల్లి శివకుమార్, టిడిపి నాయకులు కోసూరు కేశవులు, ఉప్పాల ఈశ్వరయ్య, మానుగుంట మోహన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, దయాకర్ రెడ్డి, రాధయ్య, గున్నం వేణు, రమణయ్య, మోహన్ రావు, రమేష్, సూర్యం, శ్రీను, బుజ్జమ్మ, మాలతి తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్లో చేనేత పరిశ్రమకు తీవ్ర అన్యాయం

- ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పముజుల హరి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూర్ గ్రామంలో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పముజుల హరి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 35 లక్షల చేనేత మగ్గాలు ఉన్నాయని తెలియజేశారు. అలాగే చేనేత మీద ఎనిమిది కోట్ల మంది కార్మికులు, ఉపవృత్తుల వారు జీవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే సుమారుగా 51 లక్షల కోట్ల బడ్జెట్లో 200 కోట్లు కేటాయించడం చాలా దారుణమైన పరిస్థితి చేనేత పరిశ్రమ దిగజారడం జరుగుతుంది. అసలే చేనేత పరిశ్రమలో పనులు లేక చాలీసాలని కూలీలు, మరొక ప్రక్కన రంగులు రసాయనాలు పట్టు నూలు వీటి మీద ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతుంటే వాటిని అదుపు చేయలేకపోగా దారుణమని తెలిపారు. అదేవిధంగా బడ్జెట్లో కనీసం పదివేల కోట్లయినా కేటాయించవలసి ఉండగా 200కోట్లు మాత్రమే కేటాయించి చేనేత కార్మికుడు చాలీచాలని కూలీలతో అప్పుల బాధతో ఆత్మహత్యల పరం పరం కొనసాగుతుంటే కనీసం వారిని బ్రతికించి చేనేత పరిశ్రమని కాపాడవలసిన కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# అంబటి రాంబాబు దిష్టిబొమ్మకు శవ యాత్ర



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు మండలం అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు వాడిన అసభ్య పదజాలంకు నిరసనగా బస్టాండు సెంటర్ వద్ద అంబటి రాంబాబు దిష్టిబొమ్మకు పాడి కట్టి శవయాత్ర ఊరేగింపు చేశారు. జోహార్ రాంబాబు అంటూ నినాదాలు చేస్తూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు దిష్టిబొమ్మ ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునయాదవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అసభ్య వ్యాఖ్యలు చేస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రిని నానా మాటలు అంటే ఊరుకునేది లేదు అని చావు డప్పుతో శవయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈదురు రామ్మోహన్ రెడ్డి, కొండారెడ్డి, శ్రీధర్ రెడ్డి, శివకృష్ణ, శోభన్, అలిమత్తు, తిరుమల శెట్టి సతీష్ నాయుడు, పల్లికొండ సీనయ్య, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి : సీపీఎం

**పొట్టే పాళెం, పాత వెల్లంటి గ్రామాలలో సంతకాల సేకరణ**



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** పని హక్కు కోసం 2005 జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ, రాష్ట్రాలపై భారాలు మోపే విబిజి రామ్‌జి చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టే పాళెం, పాత వెల్లంటి గ్రామాలలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ముత్యాల నాగయ్య, పాదర్తి మస్తానయ్యలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని వ్యవసాయ కార్మికులకు పేద రైతులకు కొనుగోలు శక్తిని పెంచే ఎంతో ఉపయోగకరమైన ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడం అంటే భూస్వాములకు పెట్టుబడి దారులకు మేలు చేయడమేనని అన్నారు. వెంటనే విబిజి రాంజీ చట్టాన్ని రద్దుచేసి 2005 ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీ వెంకటరమణయ్య, సుధాకర్, ఫాదర్తి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలి

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో వడ్డెర వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. ముందుగా నెల్లూరు నగరం విఆర్‌సి సెంటర్‌లో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహంకు వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజి దయాకర్ పాల్గొని పూలమాల వేసి అనంతరం అక్కడనుండి నినాదాలతో కలెక్టర్ వారి కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్కి వినతి పత్రం సమర్పించిన అనంతరం సంఘం ప్రధాన కార్యదర్శి గుంజి దయాకర్ మాట్లాడుతూ.. తెలుగుదేశం కూటమి పార్టీలు ఎన్నికలలో వడ్డెర్లకు వడ్డెర వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహాలను ప్రభుత్వమే అన్ని రకాల ఖర్చులను భరించి వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ సలహాదారుడు మద్దూరు రాంప్రసాద్, గౌరవ అధ్యక్షులు బెల్లంకొండ వెంకయ్య, జిల్లా కోశాధికారి మల్లి నాగార్జున్,



జిల్లా నాయకులు బత్తల కృష్ణయ్య, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, గుంజి రమణయ్య, అచ్చి అనంతయ్య, బత్తల వేణు, బత్తల ప్రసాదు, బత్తల రమణయ్య, రాపూర్ వెంకయ్య, ఒలిపి సుబ్రహ్మణ్యం, వల్లి రాంప్రసాద్, ఒకటి భారతి, మల్లి వజ్రమ్మ మల్లి జ్యోతి దేవుళ్ళ గౌరీ, డి.అంకయ్య, యామాల వెంకటేశ్వర్లు, బి.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రావెల్ మాఫియాను అరికట్టండి

## దళిత సంఘర్షణ సమితి అధ్యక్షులు ఎస్.మల్లీ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దానికి ముందు వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఈ గ్రావెల్ మాఫియా ఎక్కడ కూడా ప్రభుత్వ అధికారులు కానీ అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కానీ అరికట్టలేక పోతున్నాయని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లీ తెలిపారు. సోమవారం కావలి ఆర్డిఓ ఎస్.వంశీ కృష్ణ, తహసిల్దార్ శ్రావణ్ కుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి అధ్యక్షులు మాట్లాడుతూ.. బోగోలు మండలం తిప్ప దగ్గర బోర్డన్ స్కూల్ సమీపంలో నాలుగు రోజుల నుండి గ్రావెల్ మాఫియా విచ్చలవిడిగా గ్రామాలను తరలిస్తుంటే పక్కనే పోలీస్ స్టేషన్ను ఉన్న మాఫియా లెక్కచేయకుండా గ్రావెల్ తీసుకెళ్తున్నారని తెలిపారు. రెండు జెసిబిలు ఆరు టక్కులతో రాత్రులు గ్రావెల్ తవ్వుతున్న అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ, కాలం గడుపుతున్నారు. అంటే గ్రామాలు మాఫియాతో తాసిల్దారులు కుమ్మక్కయ్యారా.. లేక వారిలో కూడా వీరు భాగస్తులా.. అనేది ప్రజలకి అర్థం కావడంలేదని వారు తెలిపారు. రామస్వామి పాలెం దగ్గర గిరిజన కాలనీకి మీరు వస్తే రెండు ట్రక్కుల మట్టి తోలుకుంటామంటే నెల్లూరులో మైనింగ్ పర్మిషన్ తహసిల్దార్ పరిమిషన్ అని చెప్పారు. పేదవాడికి 100పర్మిషన్లు కావాలని డబ్బున్నవారికి ఏ పర్మిషన్ లేకుండా స్కూలు భూముల్లో తాగుతున్నారని వారు తెలిపారు. జోక్యం చేసుకొని నిలుపుదల చేయాలని లేకపోతే జిల్లా మొత్తం ధర్నాలు నిర్వహించడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మలపూడి నరసింహారావు, జరుగుమల్లి విజయరత్నం, చలంచర్ల లక్ష్మయ్య, రామదాసు, ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

# మాదిగలపై దాడులు సహించం

## సీమాంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల మాదిగలపై జరుగుతున్న దాడులను సహించబోమని, అలాగే రాష్ట్రంలోని ప్రజానీకం ముక్తకంఠంతో వ్యతిరేకించాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ పిలుపునిచ్చారు కర్నూలుకు చెందిన మాదిగ వర్గీయుడైన రమేష్ అనే వ్యక్తిని అతి కిరాతకంగా హత్య చేసిన వైనంపై మాదిగ జేఏసీ సంఘాలు సోమవారం స్థానిక విఆర్‌సి సెంటర్‌లో భగ్గుమన్నాయి. రమేష్ అనే మాదిగ కులస్తుడిని కర్నూలులో అకారణంగా దాడి చేసి హింసించి ట్రాక్టర్ కింద పడేసి తొక్కించి, రాడ్లతో అతి కిరాతకంగా అమానవీయ కోణంలో కొట్టి చంపడం జరిగిందని పందిటి సుబ్బయ్య మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై నెల్లూరులో మాదిగ జేఏసీ సంఘాల నేతలు ఏకమై నిరసన వ్యక్తం చేయడం జరిగిందన్నారు. ఏ ప్రభుత్వంలోనూ మాదిగలకు రక్షణ లేదన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో మాదిగ వర్గీయుడైన డాక్టర్ సుధాకర్‌ని దారుణంగా చంపిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా మాదిగలపై వరుస దాడులు పునరావృతం అవుతున్నాయని ఆవేదన



వ్యక్తం చేశారు. తామంతా ఈ దాడులను ఖండిస్తున్నామని తెలిపారు. కూటమిని ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చేందుకు మాదిగలు ఎంతో శ్రమించారని, అలాంటి వారిపై కూడా ఈ ప్రభుత్వంలో దాడులు జరగడం శో చనీయమన్నారు. వరుస దాడులు ఇలాగే పునరావృతం అయితే ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన రాష్ట్రవ్యాప్త నిరసనలకు పూనుకుంటామని హెచ్చరించారు. మాదిగలపై దాడుల పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో ఇలాంటి కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి త్వరితగతిన నేరస్తులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘాల జేఏసీ నేతలు బెల్లంకొండ గోపి, కోలగట్ల రమేష్, పల్లాల శ్రీనివాసులు, చిన్నయ్య, ఆనందరావు, సాల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ పొరుగు సేవల సిబ్బందికి యూనిఫామ్, చీరలు పంపిణీ

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణ ఎపిఎస్ ఆర్టీసీ డిపో పారిశుధ్య, పొరుగు సేవల సిబ్బందికి ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి అప్రాన్‌లు, చీరలు పంపిణి చేశారు. ఈ సందర్బంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ.. తన జోన్ పరిధిలోని 27 డిపాల పరిధిలోని పారిశుధ్య, పొరుగుసేవల సిబ్బంది సంక్షేమం కొరకు కృషి చేసానని అన్నారు. అందరికీ ఉచిత వైద్యం సేవలు, జీవిత బీమా కల్పించామని పేర్కొన్నారు. కావున అసంఘటిత కార్మికులు ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. ఉదయగిరి డిపోకు 20 లక్షలు, గూడూరు డిపోకు 10లక్షల రూపాయలు కేటాయించి రిపేర్ల వంటి సివిల్ పనులు, ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని, కావలి బస్టాండ్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్బంగా పారిశుధ్య, పొరుగుసేవల సిబ్బంది సురేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ డి.ఆదినారాయణ, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఎం.కల్పన, ట్రాఫిక్, మెకానికల్ సూపెర్వైసర్లు ఎం.రామకృష్ణ, డి.రవిప్రకాష్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## 7న మండల సర్వసభ్య సమావేశం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 7వ తేదీన నిర్వహించబడుతుందని ఎంపీడీవో కే శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎంపీపీ వని పెంట హైమావతి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. కావున సమావేశానికి జడ్పిటిసి సభ్యులు ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు, మండల స్థాయి అధికారులు అందరూ తమ తమ అభివృద్ధి నివేదికలతో హాజరుకావాలని ఆయన తెలిపారు. అధ్యక్షుడు అనుమతితో ఇతర అంశములపై చర్చించబడతాయని తెలిపారు. కావున అందరూ సకాలంలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు.

## సీపీడీవోకు సమ్మె నోటీసు అందజేత



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఈనెల 12వ తేదీన సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు పలువురు అంగ న్వాడీ కార్యకర్తలు సోమవారం సీడీపీవో పుణ్యవతికి ముందస్తుగా నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లను గ్రేడ్-3, ఆయాలను గ్రేడ్-4 ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రజియాబీ, ప్రమీలమ్మ, గడ్డం నాగేశ్వరరావు, నాయబ్ రసూల్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని ఆందోళన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** కేంద్రం ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని సవరిస్తూ విడుదల చేసిన జీవోను రద్దు చేసి యథావిధిగా కొనసాగించాలని సోమవారం బండగానిపల్లి పంచాయతీ బిజ్జంపల్లి సచివాలయం ఎదుట రైతుసంఘం ఆద్వర్యంలో కూలీలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం వ్యవసాయ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తుండడం దారుణమన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడల్లుగా మార్చి అమలు చేయడం కార్మికుల పొట్టకొట్టడమేనన్నారు. రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి చినబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, రైతులు తదితులు పాల్గొన్నారు.

## నిబంధనలు గాలికొదిలేసి గ్రావెల్ దోపిడీ

### నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు.!



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకిలో నిబంధనలను తుంగలో తొక్కి, అధికారుల కళ్లు గప్పి, యథేచ్ఛగా అక్రమార్కుల గ్రావెల్ దోపిడీ సాగుతోంది. పగలు ప్రశాంతంగా కనిపించే చెరువు, చీకటి పడితే చాలు జెసిబిల గర్జనలు, ట్రాక్టర్ల హోరుతో దద్దరిల్లిపోతోంది. రాత్రి వేళల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నా, అడిగే నాథుడే కరువయ్యారని స్థానిక ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. విలువైన ఖనిజ సంపదను కొల్లగొడుతూ, చెరువు కట్టలను బలహీనపరుస్తున్నా అటు రెవెన్యూ, ఇటు ఇరిగేషన్ విభాగాలు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక ఉన్న మర్మమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ అక్రమ తరలింపుపై ఇరిగేషన్ ఏఈని వివరణ కోరగా, 'మా దృష్టికి రాలేదు, మాకు సమాచారం లేదు' అంటూ నీరసమైన సమాధానం చెప్పడం గమనార్హం. చెరువులో ఇంత భారీ ఎత్తున తవ్వకాలు జరుగుతుంటే అధికారులకు తెలియకపోవడం విడ్డూరంగా ఉందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఎంపీపీనీ సన్మానించిన మెట్టుకూరు

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన అనంతసాగరంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షులు మెట్టుకూరు సుబ్బారెడ్డి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు పిసంపూర్ణమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పి.సంపూర్ణమ్మను ఘనంగా సన్మానించారు. వైయస్సార్ టిఏ డైరీని ఎంపీపీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా వైఎస్ఆర్టిఏ ఉపాధ్యక్షులు సత్యాల డానియల్ పాల్గొన్నారు.

## సోమశిల వైకాపాలో కొత్త నాయకత్వం

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా వైకాపా జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల వైకాపా పెద్దలు సోమశిల వైకాపా నాయకులతో గ్రామ కమిటీపై చర్చించడం జరిగింది. వైకాపా గ్రామ అధ్యక్షులుగా గ్రామ ఉపసర్పంచ్ మహబూబ్ బాషా ఎంపిక చేశారు. పార్టీ బాధ్యతలు, కార్యక్రమాలు నూతన అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా చేతుల మీద గానే జరుగునున్నాయి. సోమశిలలో వైకాపాలు నాయకుల గందరగోళంతో ప్రజల్లో పార్టీ ఉనికి కోల్పోయినది. ప్రజల్లో గందరగోళాన్ని గమనించిన వైకాపా అధిష్టాన పెద్దలు పెను మార్పులు తీసుకురావడం జరిగింది. గ్రూపులకి తెరదించి గ్రామంలో కొత్త నాయకత్వం ఏర్పాటు చేశారు.

# భార్యను హత్య చేసిన కేసులో ముద్దాయి అరెస్ట్



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యను హత్య చేసిన భర్తను సోమవారం అరెస్టు చేసినట్లు బాలాజీ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కే.సాంబశివరావు మీడియాకు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు కోటమిట్టకు చెందిన ముద్దాయి జువ్వలదిన్నె శ్రీహరి (34)తన భార్య శ్రీ నందిని పై అనుమానంతో తన భార్య 31-01-2026 వేకువుజమున బెంగళూరు నుంచి తన తల్లి చెన్నూరు ఉమా ఇంటి వద్దకు వెళ్లేందుకు చింతా రెడ్డిపాలెం క్రాస్ రోడ్స్ వద్ద బస్సు దిగగా మాయమాటలు చెప్పి తన స్కూటీపై ఎక్కించుకొని తీసుకువెళ్లి చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు నందుగల పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మృతురాలని కత్తితో గొంతు కోసి విచక్షణారహితంగా పొడిచి చంపినట్లుగా తన తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలాజీ నగర్ పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలియజేశారు. దర్యాప్తులో భాగంగా ముద్దాయిని అరెస్టు చేసి విచారించగా నిందితుడు కొమిట్ల ట్రావెల్స్ బస్సులకు సూపర్వైజర్‌గా పనిచేస్తున్నట్లు మృతురాలు అయిన తన భార్య శ్రీ నందిని తన చిన్ననాటి స్నేహితులు అయినటువంటి సుభాష్ అను అతనితో అక్రమ సంబంధం ఉందని తెలిసి ముద్దాయి ఆమె ప్రవర్తన మార్చుకోమని చెప్పిన ఆమె మార్చుకోలేదు ఆ గొడవలో ఆమె తన తల్లి ఉంటున్న ఆత్మకూరులోని నెల్లూరు పాలెం గ్రామానికి వెళ్లి అక్కడే ఉంటున్నట్లు, మూడు నెలల క్రితం మృతురాలు ఆమె ప్రియుడు శుభాష్‌తో కలిసి మైపాడు బీచ్ లో ఉండగా ముద్దాయి వారిద్దరిని పట్టుకొని గొడవ జరగగా సదురు గొడవను చిన్న బజార్ పోలీస్ స్టేషన్ వారు విచారించి వారిని మందలించి పంపారని, తరువాత మృతురాలు బెంగళూరులోని ప్రైవేట్ ఉద్యోగంలో చేరి అప్పుడప్పుడు నెల్లూరులోని ముద్దాయి వద్దకు వస్తూపోతూ ఉండేదని అప్పటికి మృతురాలు తన పద్ధతి మార్చుకోకుండా తన ప్రియుడు సుభాష్‌తో ఫోన్లో మాట్లాడుతూ వారి అక్రమ సంబంధం కొనసాగిస్తున్నట్లు ముద్దాయికి తెలిసి అది జీర్ణించుకోలేక ఎలా అయినా తన భార్యను చంపాలని నిర్ణయించుకుని కత్తితో గొంతు కోసి పొడిచి చంపినట్లు విచారణలో ముద్దాయి నేరం చేసినట్టు తెలిపినట్లు బాలాజీ నగర్ సిఐ సాంబశివరావు తెలియజేశారు. హత్యకు ఉపయోగించిన కత్తి, స్కూటీని స్వాధీనం చేసుకొని ముద్దాయిని కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు. హత్య కేసు ముద్దాయిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన సీఐ కె.సాంబశివరావు, ఎస్సై విజయ్ శ్రీనివాస్, వారి సిబ్బంది సుధాకర్, రమేష్, జయరామయ్య, శివకుమార్, శ్రీహరి, సాయి కిషోర్, నాగరాజులను ఉన్నత అధికారులు అభినందించారు.

# ఉపాధి హామీ చట్టం పునరుద్ధరించాలి



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విబి జీ రాశీ జీ స్కీం రద్దు చేయాలని పాత మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం పునరుద్ధరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయు ఆధ్వర్యంలో సదస్సు ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగల పుల్లయ్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలకు,పేద రైతులకు ఇతర వృత్తిదారులకు పని కల్పించి ఆకలి చావుల నివారణకు గ్రామాల్లో వలసలు తగ్గించడానికి 2005 సంవత్సరంలో సిపిఎం, వామపక్షా పార్టీలు మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ చట్టం చేయాలని యూపీఏ ప్రభుత్వం మీద ఒత్తిడి చేసి పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం తీసుకుని వచ్చిందన్నారు. ఇప్పుడు ఆ చట్టం రద్దు చేసి దాని స్థానంలో మోడీ ప్రభుత్వం కొత్తగా 'విబి జీ రామ్ జీ' స్కీం తీసుకొని వచ్చిందని అన్నారు.కొత్త వచ్చిన స్కీం ఉపాధి హక్కును దెబ్బతీసే విధంగా ఉన్నదని అన్నారు. పాత ఉపాధి హామీ చట్టంలో కేంద్ర ప్రభుత్వం 90శాతం నిధులు ఇస్తే, రాష్ట్రాలు 10శాతం నిధులు భరాయించేవి కానీ ఈ కొత్త స్కీంలో 60శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు 40శాతం రాష్ట్రాల నిధులు కేటాయించాలని చెప్పడం జరిగిందనీ అన్నారు. అంటేబ ఇప్పటికే అప్పుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి నిధులు కేటాయించలేవు అంతేకాదు ఏదైనా రాష్ట్రాలునిధులు లేక పెట్టక పోతే కేంద్రం ప్రభుత్వం నిధులు ఇవ్వదు. ఆ విధంగా ఈ పథకాన్ని క్రమేపి ఎత్తివేసే దురుద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తెచ్చిందన్నారు. వందరోజుల పనికి బదులు 125 రోజులు పెంచామని ప్రచారం చేస్తున్నారు తప్ప సంవత్సరంలో 60 రోజులు పనుల నిలుపుదల చేయాలని ఈ స్కీమ్ లో ఉందని ఇది ప్రజలకు చెప్పడం లేదన్నారు. 2005 మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టంలో అడిగిన వారందరికీ పనులు కల్పించాలని ఉన్నది, కానీ ఈ కొత్త చట్టంలో పని హక్కు లేదు. కేంద్ర ప్రభుత్వం కేటాయించే నిధుల కంటే ఎక్కువ ఖర్చు అయితే ఆ భారాన్ని రాష్ట్రాలే భరించాలి అందువల్ల ఆర్థిక భారంతో అప్పుల్లో ఉన్న రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేయలేవు, ఇటువంటి దుర్మార్గ పథకాన్ని రాష్ట్రం లో ఉండే అధికార పక్షం అయిన తెలుగుదేశం, జనసేన, ప్రధాన ప్రతిపక్ష వైసిపి పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా ఆమోదించడం సిగ్గుచేటు అన్నారు. ప్రజలకు ద్రోహం చేసే ఈ పథకాన్ని రద్దుచేసి పాత ఉపాధి హామీ గ్రామీణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ అన్వర్‌బాషా, సీఐటీయు మండల అధ్యక్షుడు మీరా మొహిద్దిన్, జక్రయ్య, సీఐటీయు నాయకులు సునీత, నాగమణి, కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కార్యదర్శులు రమణయ్య, నాగులూరు వెంకటేష్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## పీబీజీ రాంజీ పథకం రద్దు చేయాలి : సీపీఎం



**మనుబోలు, మేజర్‌న్యూస్ :** చెర్లోపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలు సచివాలయం అధికారి పంచాయతీ కార్యదర్శికి కొత్తగా వచ్చిన పీబీజీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలని, సోమవారం వినతిపత్రం అందజేశారు. ఉపాధిహామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, కార్మికులకు మేలు చేసే పాత కార్మిక చట్టాల్ని అమలు పరచాలని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అనేక సమస్యలపై అర్జీలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తలారి దేవదానం, విశ్వనాథ భాస్కర్‌రెడ్డి, రాజవరపు పద్మ లక్ష్మమ్మ, మస్తానమ్మ, సుబ్బరత్నమ్మ, కావేరి వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.

## దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో నివారణ సందర్భంగా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం కావలిలో ఉండే 40వ వార్డులో 28వ సచివాలయం నందు 100 మైక్రో ప్యాకెట్లు మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు దోమల నివారణ కొరకు యాంటీ లార్వా స్పెషల్ డ్రైవ్‌ను సానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్ ఆధ్వర్యంలో నిర్వహించారు కావలి పట్టణంలో రోజురోజుకీ పెరిగిపోతున్న దోమలు వాటి వలన వ్యాధులు ప్రబలకుండా వాటిని అరికట్టేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది విధులు నిర్వహించే విధంగా పర్యవేక్షిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆదేశాలు మేరకు సోమవారం 32వ డివిజన్ ఎన్సిసి కాలనీలోని కబరస్థాన్ నందు జరుగుతున్న అభివృద్ధి పనులను అలాగే 3వ తేదీ షబ్బే బరాత్ సందర్బంగా జరుగుతున్న శానిటేషన్, లైటింగ్ పనులను రూరల్ మైనారిటీ సెల్ అధ్యక్షులు అస్లాంతో కలసి 32వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీరా భాయ్, అబ్దుల్ అజీజ్, హఫీజ్, మంజూర్, ప్రసాద్, హుస్సేన్, సుభాని, జిలాని, సమ్మీ, అశ్రఫ్, మస్జీద్ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వినియోగదారుల

# సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక ప్రారంభం

- ప్రతి నెల మొదటి బుధవారం విద్యుత్ భవన్‌లో నిర్వహణ
- జిల్లా సూపరిండెంటింగ్ ఇంజనీరు కే.రాఘువేంద్రం



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి సూచనల మేరకు నెల్లూరుజిల్లాలో పారిశ్రామిక వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీరు కే.రాఘువేంద్రం తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పారిశ్రామిక వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక' పేరుతో కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి లిపారిశ్రామిక వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక.అనే నామకరణం చేసినట్లు ఆయన వివరించారు. ఈ వేదిక ద్వారా పారిశ్రామిక వినియోగదారుల విద్యుత్ సంబంధిత సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ప్రతి నెల మొదటి బుధవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఉదయం 10:30 నుండి 11:30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. పారిశ్రామిక వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ వేదిక పారిశ్రామిక వినియోగదారులకు ఒక చక్కని అవకాశమని, తమ సమస్యలు, సందేహాలను నేరుగా తెలియజేసి పరిష్కారం పొందవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పారిశ్రామిక వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పి4పథకం పేదలపాలిట వరప్రసాదం : ఆత్మకూరు ఆర్డీవో పావని




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం దూరాలోచనతో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పి4పథకం పేదలపాలిట వరప్రసాదమని ఆత్మకూరు ఆర్డీవో భూమిరెడ్డి పావని పేర్కొన్నారు. సోమవారం పి4పథకంలోభాగంగా ఒక దాతద్వారా ఆత్మకూరులోని మూడు హాస్టళ్ళకు విద్యుత్ఇన్వర్లను సమకూర్చి పంపిణీ చేశారు. చేజర్ల మండలం పుల్లనీళ్ళపల్లికి చెందిన శ్రీలక్ష్మి కన్స్ట్రక్షన్స్ ఎండి డి.సి.నరశింహారావు అనే దాత మార్గదర్శకులుగా నమోదై ఉండగా ఆయన స్వంత నిధులతో 3 ఇన్వర్టర్లను సమకూర్చారు. వాటిని స్థానిక సాంఘికసంక్షేమ బాలుర, బాలికల వసతిగృమాలకు, ఏపి గురుకుల బాలికల పాఠశాలకు ఆర్డీవో పావని చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆర్డీవో పావని ప్రసంగిస్తూ హాస్టళ్ళలో విద్యుత్ నిలిచిపోయిన సందర్భాల్లో చదువుకోవడానికి ఆటంకం లేకుండా ఇన్వర్టర్లను దాత ద్వారా అందజేశామన్నారు. ప్రభుత్వం పి4పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తుండగా ఈకార్యక్రమం ద్వారా దాతలను మార్గదర్శకులుగా, పేదలకు బంగారుకుంటుంబాలుగా గుర్తించి దాతలద్వారా పేదలకు ప్రభుత్వ సంక్షేమపథకాలు అందేలా, మౌళికవసతులు కల్పించడం, వారి జీవనోపాధికి అవకాశం కల్పించడం పథకం లక్ష్యమని, ఆత్మకూరు డివిజన్‌లో దాదాపు 5వేలకుపైగా మార్గదర్శకులు, బంగారుకుటుంబాలను గుర్తించి ఇప్పటికే పలువురికి సాయమందించామని ఆర్డీవో పేర్కొన్నారు. దాత నరశింహరావు సాయంతో 3హాస్టళ్ళకు ఇన్వర్టర్లు సమకూర్చడం సంతోషదాయకమని ఆర్డీవో పావని పేర్కొన్నారు. ఈసందర్భంగా సాంఘికసంక్షేమ అధికారులు పావనిని ఘనంగా సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక సహాయసాంఘికసంక్షేమాధికారి బ్రహ్మానందాచారి, హాస్టల్‌వెల్ఫేర్ ఆఫీసర్లు పద్మనాభరెడ్డి, స్పందన, ఖాదరున్నీసా, హాస్టల్స్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 54 అర్జీలు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నెల్లూరు నగర పాలక సంస్థ ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమిషనర్ వైఓ నందన్‌లు పాల్గొని అర్జీ దారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ.. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న వాటి పరిష్కారానికై ప్రజా సమస్యల పరిష్కార వేదికను సందర్శించాలని సూచించారు. మొత్తం 54 విజ్ఞప్తులను వేదిక ద్వారా అందుకుని వాటిలో 14 ఫిర్యాదులకు వెంటనే పరిష్కారం అందించామని తెలిపారు. మిగిలిన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిర్దేశించిన గడువులోపు పూర్తి చేసేందుకు నగర పాలక సంస్థ కమిషనర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు అందరూ కృషి చేస్తారని వివరించారు. నిర్దేశించిన గడువులోపు అన్ని సమస్యలకు పరిష్కారాలను అందించాలని, పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగం అధికారులకు మేయర్ సూచించారు. పట్టణ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిల సారధ్యంలో వివిధ అభివృద్ధి పనులను చేపడుతున్నామని, నెల్లూరు నగరపాలక సంస్థను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని మేయర్ ఆకాంక్షించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులందరూ టిడ్కో గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నోటీసులు ఇచ్చినప్పటికీ గృహాలకు రిజిస్ట్రేషన్ చేసుకోకుండా స్వాధీనం పొందని టిడ్కో గృహాలను అర్హులైన ఇతరులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 ద్వారా అందజేస్తామని కమిషనర్ ప్రకటించారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నులను చెల్లించి నగరా వ్యాప్తంగా జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులలో భాగస్వాములు కావాలని, నిర్దేశించిన సమయంలోపు పన్నులను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ సూచించారు. వీధి శునకాలు, రోడ్లపై పశువుల సంచారం నియంత్రణలో భాగంగా ప్రతిరోజు స్పెషల్ డ్రైవ్ ద్వారా అన్ని డివిజన్లలో శునకాలను పట్టి పాత మున్సిపల్ కార్యాలయంలోని ఏబీసీ సెంటర్ ద్వారా శస్త్ర చికిత్సలు చేయిస్తున్నామని తెలిపారు. పశువుల యజమానులు వాటిని రోడ్లపై వదులుతున్నందువల్ల డివైడర్లపై ఉన్న మొక్కలు నాశనం అవ్వడంతోపాటు రోడ్డు ప్రమాదాలకు ప్రధానంగా కారణమవుతున్నాయని కమిషనర్ తెలిపారు. పశువులను యజమానులు వాటి సంరక్షణలో ఉంచుకోకుండా రోడ్లపై వదిలితే గోశాలలకు తరలించి, 30 వేల వరకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విభాగాల వారీగా టిడ్కో హౌసింగ్ 17, టౌన్ ప్లానింగ్ 12, రెవెన్యూ 2, ఇంజనీరింగ్ 8, పబ్లిక్ హెల్త్ 3, ఆప్కాస్ 2, అకౌంట్ సెక్షన్ 8, పెన్షన్ 2 మొత్తం 54 వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్‌ఈ రహంతు జానీ, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన వైసీపీ నాయకులు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** తిరుమల లడ్డు ప్రసాదం కల్తీ జరిగిందని అవాస్తవాలు ప్రచారం చేస్తున్న కూటమినేతలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం నెల్లూరు వేదయపాలెం పోలీస్ స్టేషన్‌లో జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నెల్లూరు వేదయపాలెం పోలీస్ స్టేషన్‌లో వైసిపి జిల్లా అధ్యక్షులు లికాకాని గోవర్ధన్ రెడ్డి నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి రూరల్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి వైస్సార్సీపీ నేతలతో కలిసి.. తిరుమల లడ్డు ప్రసాదం కల్తీ జరిగిందని టిడిపి నేతలు ఫ్లెక్స్‌లు ఏర్పాటు చేసి చేస్తున్న అసత్య ప్రచారాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. వేదయపాలెం పోలీస్ స్టేషన్లో పోలీస్ అధికారికి లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. సిట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా.. తిరుమల లడ్డు ప్రసాదంలో జంతు కొవ్వు కలవలేదని, సిబిఐ కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, కూటమినేతలు అవాస్తవాలను ప్రచారం చేస్తూ, హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నేతలు చేస్తున్న, పనులకు వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని, ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా వాసి అయ్యుండి తిరుమల పవిత్రత గురించి తెలిసి కూడా తిరుమల లడ్డు ప్రసాదంపై అవాస్తవాలు, ప్రచారం చేయడం, దుర్మార్గమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఆధారం లేనటువంటి ఆరోపణలు చేస్తూ తిరుమల లడ్డు ప్రసాదం పవిత్రతను దెబ్బతీసే విధంగా హిందూ ప్రజల మనోభావాలను కించపరుస్తున్నారని అన్నారు. సిట్ ఇచ్చిన తీర్పును కూడా వక్రీకరిస్తూ.. ప్రజల్లో అవాస్తవాలను తీసుకెళ్లే విధంగా కూటమి నేతలు పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తిరుమల లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగిందని, అవాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని చూసి ప్రజలందరూ సిగ్గు పడుతున్నారన్నారు. అలాగే గుంటూరులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించాలని అంబటి రాంబాబు చెబితే ఆయన ఇంటిపై కూటమి నేతలు దుర్మార్గంగా దాడి చేశారని అన్నారు. అలాగే అంబటి రాంబాబుపై కూడా కట్టలు రాడ్లు తీసుకొని కూటమినేతలు ఆయనపై హత్యాయత్న ప్రయత్నం చేశారని అన్నారు. ఇలా ఆవేశంలో ఆయన ఏదో రెండు మాటలు పొరపాటున మాట్లాడితే.. దీనిపై తిరిగి పొరపాటు జరిగిందని ఆయన వివరణ ఇచ్చుకున్నప్పటికీ.. ఆ మాటలను వక్రీకరించి ముఖ్యమంత్రిని దూషించారని ఆయనపై దుర్మార్గంగా కేసు పెట్టడం కక్షపూరితమేనన్నారు. అంబటి రాంబాబు ఇంట్లో వారి సతీమణి, కుమార్తె ఉండగా.. కనీసం ఆడవాళ్లు ఉన్నారన్న జాలి దయ లేకుండా వాళ్ళను పక్కకు నెట్టేసి ఇంటిపై దాడి చేసి విధ్వంసం సృష్టించారని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్ర ప్రశాంతతను పాడు చేస్తూ కూటమినేతలు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. కూటమినేతలు చేస్తున్న అక్రమాలు, అవాస్తవ ప్రచారాలపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయకపోతే.. కోర్టులను ఆశ్రయించడంతోపాటు భవిష్యత్తులో.. వారిపై చట్టపరమైన.. చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాఠశాలకు రాని అయ్యోర్లు..

## పాఠశాలకు తాళం వేసిన స్కూల్ ఛైర్మన్, తల్లిదండ్రులు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మండలం గుండవోలులోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు నాలుగు నెలలుగా ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యతనిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యా విధానాన్ని ఆశాఖ అధికారులు తుంగలో తొక్కుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆశయం పక్కదారి పడుతోంది. రాపూరు మండలం గుండవోలులోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి నుండి ఐదో తరగతి వరకు 26 మంది విద్యార్థులు ఉండగా నాలుగు నెలలుగా ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు ప్రతిరోజు స్కూలుకి రావడం సాయంత్రం దాకా ఖాళీగా కూర్చోవడం తిరిగి వెళ్లిపోవడం జరుగుతుంది. తల్లిదండ్రులు పలుమార్లు మండల విద్యాశాఖ అధికారికి విన్నవించుకున్న ఎటువంటి స్పందన లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం స్కూల్ ఛైర్మన్ దుగ్గునేటి కావేరి విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి స్కూల్‌కు తాళం వేసి ఉపాధ్యాయుడు లేని స్కూల్ మాకు వద్ద అంటూ నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# జిల్లా పోలీస్ క్రీడల్లో సత్తా చాటిన జలదంకి ఎస్ఐ



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జిల్లా పోలీస్ క్రీడల్లో జలదంకి ఎస్ఐ పలు క్రీడలలో వివిధ కేటగిరిలలో పథకాలను ట్రోఫీలను గెలుపొంది తమ సత్తాను చాటారు. జవలింత్రో, షాట్ పుట్, లాంగ్ జంప్ హై జంప్ కబడ్డీ బ్యాట్మెంటన్ తదితర ఆటలలో ఆమె తనదైన శైలిలో ఆడి విన్నర్‌గా రన్నర్‌గా నిలిచారు. పలు ప్రైజులను అందుకున్నారు. నెల్లూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 26లో ఎస్ఐ తనదైన శైలిలో విజయం సాధించడంపై జలదంకి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ఎస్ఐని అభినందించారు.

### ప్రభుత్వ పాఠశాల నుండి..

# గ్రూప్-1 కొలువుకి ఉదయ్ శంకర్



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** కష్టపడి చదివితే సాధించ లేనిది ఏదీ లేదని తాజాగా విడుదలైన గ్రూప్– 1 ఫలితాలలో అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ ఉద్యోగాన్ని సాధించిన మన నెల్లూరు జిల్లా దుత్తలూరు యువకుడు భారతాల ఉదయ్ శంకర్ నిరూపించారు. తండ్రి విశ్రాంత ఆర్మీ జవాను భారతాల గంగాధర్, లలితల కుమారుడు ఉదయ్ శంకర్ తన విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియంలో పూర్తి చేశారు. సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో భారీ జీతం గల కార్పొరేట్ జాబ్, బ్యాంక్, రైల్వే ఉద్యో గాలను సైతం వదిలి, అకుంఠిత దీక్ష, క్రమశిక్షణ పట్టుదలతో, గత రెండు సంవత్సరాలుగా ఇంటికి దూరంగా, సోషల్ మీడియా దరి చేరకుండా పట్టుదలగా సన్నద్ధం అయ్యి, విడుదలైన ఫలితాలలో అసిస్టెంట్ కమీషనర్ స్టేట్ అసిస్టెన్స్ సేల్ ట్యాక్స్‌కి ఎంపిక అయ్యారు. పలువురు ఆయనను అభినందించారు.

# కమాండ్ కంట్రోల్‌ను తనిఖీ చేసిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం పనితీరును సోమవారం ఉదయం తనిఖీ చేశారు. కంట్రోల్ సెంటర్‌కు ఆ సమయానికి హాజరైన సిబ్బంది వివరాలు, విధులకు హాజరైన సమయంతోపాటు వార్డు సచివాలయ కార్యదర్శులతో ఫోన్ కాల్స్ ద్వారా మానిటరింగ్ చేస్తున్న విధానాలను కమిషనర్ పరిశీలించారు. కంట్రోల్ సెంటర్లో సీసీటీవీల ద్వారా జరుగుతున్న మానిటరింగ్, పారిశుధ్య నిర్వహణ పనులు, అన్న క్యాంటీన్‌ల నిర్వహణ తీరును కమిషనర్ పరిశీలించి సిబ్బందికి వివిధ సూచనలు జారీ చేశారు.

# బ్రహ్మోత్సవాల గోడపత్రిక ఆవిష్కరించిన ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో స్థానిక కచ్చురిమిట్ట శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు 31వ బ్రహ్మోత్సవ కార్యక్రమం గోడపత్రికను సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి బ్రహ్మోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాల నుండి ఆధ్యాత్మిక శోభతో గోవింద నామ స్మరణలతో ఈ ఉత్సవాలు చేయడం అందరికీ శుభ పరిణామం అని, స్వామివారి ఆశీస్సులు అందరికీ ఉండాలని కొండపిట్రగుంటలో ఇటు కచ్చురిమెట్టలు ఒకేసారి జరిగే ఉత్సవాలు చాలా ఆనందదాయకమని తెలిపారు. ఆయన కమిటీ వారు ప్రతి సంవత్సరం కూడా బ్రహ్మాండమైన రీతిలో ఈ ఉత్సవాలు చేస్తున్నారని స్వామివారిని పురవీధుల్లో ఊరేగిస్తూ, ప్రజలందరికీ స్వామి వారి కృప కటాక్షములు అందిస్తున్నారని తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో కూడా భక్తులందరూ పాల్గొని ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నవరం వెంకట సత్యనారాయణ, నరహరి హరిబాబు, తిరువీధి ప్రసాద్ మారుతీరావు, హనుమంతరావు, ఆలయ అర్చకులు బుట్ట శేషాచార్యులు, అలహరి నరసింహారావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంజిఎన్ఆర్ఈజీఎస్ పధకాన్ని కొనసాగించాలి : సీపీఎం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కేంద్రప్రభుత్వం నూతనంగా అముచేయనున్న సిబివిరాంజీ పథకాన్ని రద్దుచేసి యధావిధిగా గతంలో ఉన్న మహాత్మాగాంధీ జాతీయగ్రామీణ ఉపాధిమామీ పథకాన్ని కొనసాగించాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మికచట్టాలను కొనసాగించాలని ఆత్మకూరు పట్టణ సిపిఎం కార్యదర్శి కె.డేవిడ్‌రాజు డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పలు సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా డేవిడ్‌రాజు మాట్లాడుతూ.. పేదలకు ఉపాధిలభించే జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని పేరుమార్చడంతోపాటు 40శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించాలని నిర్ణయించడం విచారకరమని, ఈవిధానంతో పథకం సక్రమంగా అమలయ్యే పరిస్థితి ఉండబోదని, పేదల ఉపాధికి ఆటంకం కలుగుతుందన్నారు. కేంద్రప్రభుత్వం 90శాతం నిధులిచ్చినపుడే కూలీలకు 100రోజుల పని లభించలేదని ఆయన పేర్కొన్నారు. కార్మి కులు ఉద్యమాల ద్వారా సాధించుకున్న 19 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి 4లేబర్‌కోడ్‌లను ప్రవేశపెట్టిందన్నారు. ఈలేబర్‌ఓడ్‌ను రద్దుచేసి గతంలోని కార్మిక చట్టాలను కొనసాగించాలని, ఉపాధిహామీ పథకాన్ని గతంలోలాగే కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం 90శాతం నిధులు ఇవ్వాలని డేవిడ్‌రాజు డిమాండ్ చేశారు. దాంతోపాటు ఉపాధిహామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరింపజేయాలని ఆయన కోరారు. పనిదినాలు, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈవిషయాలపై ప్రభుత్వం స్పందించకుంటే దేశవ్యాప్తంగా ఈనెల12వేతదీన పెద్దఎత్తున సామ్మెకు ఉపాధికూలీలు, కార్మికులు, మహిళాకార్మికులు పిలుపునిచ్చామని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం, అనుబంధసంఘాల నాయకులు జి.లక్ష్మిపతి, సుభాన్, రామయ్య, పద్మమ్మ, వెంకటశేషయ్య, లక్ష్మి, మున్వర్ బాషా, గిరి, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రహణం వీడని మెయిన్‌రోడ్డు

● గుంటలమయం ● తూతూమంత్రంగా రిపేర్లు
● వాహనకారుల అగచాట్లు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండునుండి సోమశిల రోడ్డు సెంటర్ వరకు రోడ్డుకు గ్రహణం వీడడం లేదు. ఒకటి కాదు, రెండుకాదు 13సంవత్సరాలుగా ఈరోడ్డు విస్తరణకు నోచుకోవడం లేదు. అటు,ఇటుగా రోడ్డు విస్తరణ జరిగి డివైడర్లు,. సెంట్రల్‌లైటింగ్ వేసి ఉండగా బస్టాండునుండి సోమశిల రోడ్డు సెంటర్ వరకు విస్తరణకు నోచుకొనకుండా అత్యంత అధ్వాన్నంగా ఉంది. 2012లో అప్పటి రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈరోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయించారు. కానీ అటు,ఇటు రోడ్డు పూర్తికాగా ఈమధ్యలో రోడ్డు అంచున ఉన్న కొందరు కోర్టునుండి స్టేపొందడంతో పనులు నిలిచిపోయాయి. అప్పటినుండి ఇరువైపుల గదుల యజమానులకు నష్ట పరిహారం చెల్లించాలంటూ ఆర్‌అండ్‌బి అధికారులు నిధులకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతుండగా అప్పటి ప్రజాప్రతినిధులు ఏమాత్రం ఈరోడ్డు విస్తరణ గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. గత నెలలో వర్షాలు కురిసినపుడు ఈరోడ్డు మోకాటిలోతు గుంటలు పడడం, జనాలు తీవ్రంగా ఇబ్బంది పడుతుండడం జరుగుతుంది. రెండు,మూడు నెలలక్రితమే ఈరోడ్డుకు తాత్కాలిక మరమ్మత్తులు చేయించగా మళ్ళీ రోడ్డు బాగా దెబ్బతిని పెద్ద గుంటలు పడడంతో జనాలు అవస్థలుపడడంతోపాటు ద్విచక్రవాహనకారులు తీవ్రంగా ఆందోళనకు గురవడం, ఇతర వాహనకారులు తీవ్ర అసౌకర్యానికి గురవడం జరిగింది. దాంతో అధికారులు తాత్కాలికంగా డస్ట్, కంకరను ఆ గుంటలకు పోశారు. కనీసం తడపడంకానీ, రోలింగ్ చేయడం కానీ జరగలేదు. మళ్లీ యధావిధిగా గుంటలు పడడంతో వాహనకారులు ఈసెంటర్‌లో రోడ్డు ఇబ్బందికరంగా ఉండగా అగచాట్లు పడుతున్నారు.. అప్పట్లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు నియోజకవర్గానికి అనేక విద్యాసంస్థలు, రెవిన్యూడివిజన్, మున్సిపాలిటీ, రోడ్లు, వంతెనలు, భవనాలను సాధించి దాదాపు 2500కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశారు. కానీ ఈరోడ్డు మాత్రం ఇరువైపులా భవనాలయజమానులు అంగీకరించకపోగా తగ్గించి 30అడుగులే వేయిద్దామని మంత్రి ఆనం అందరికీ నచ్చచెప్పారు. కానీ కొందరు కోర్టుకెళ్ళి స్టే పొందడంతో ఆనం కూడా అసహనంతో మిన్నకుండి పోయారు. దాంతో 13సంవత్సరాలుగా ఈరోడ్డు విస్తరణ ఆగిపోగా పట్టించుకున్న నాధుడే లేకపోగా జనాలు మాత్రం తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. గుంటలు పడిన సమయాల్లో ద్విచక్రవాహనకారులు ప్రమాదాలకు గురవుతుంటారు. ఈరోడ్డుకు తూతూమంత్రపు ప్యాచింగ్‌లేనా అని సర్వత్రా ప్రశ్నిస్తున్నారు. నిత్యం ఈ మెయిన్‌రోడ్డుపై పయనించే అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. అదీగాక ఈరోడ్డు ఆత్మకూరు పట్టణంలోనే ఉన్నా ఆర్‌అండ్‌బి శాఖకు చెంది ఉంది. దాంతో మున్సిపాలిటీ వారు పట్టించుకునే పరిస్థితి లేదు. అయితే నేడు మళ్ళీ ఆత్మకూరు శాసనసభ్యులుగా ఎన్నికై రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రిగా కొనసాగుతున్న ఆనం రామనారాయణరెడ్డి దృష్టి సారిస్తే తప్పకుండా ఈ విస్తరణ జరుగుతుందన్న ప్రగాఢ విశ్వాసం సర్వత్రా వ్యక్తమవుతోంది. కాబట్టి మంత్రి ఆనం చొరవతీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

## పంచాయతీకార్యదర్శులకు శిక్షణాతరగతులు




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీకార్యదర్శులకు శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఎంపిడివో పి.రఫీఖాన్ ఆధ్వర్యంలో మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి తరగతులను ప్రారంభించి ప్రసంగించారు. డివిజన్‌స్థాయిలో గ్రేడ్4, గ్రేడ్5 కార్యదర్శులకు ఆరురోజులపాటు ఈ శిక్షణా తరగతులను నిర్వహించనున్నారు. ప్రభుత్వ విధివిధానాలు, పంచాయతీరాజ్ చట్టాలు గురించి అవగాహన కల్పించేలా ఈ శిక్షణా తరగతులను నిర్వహించనున్నారు. రిఫ్రెషర్‌ట్రైనింగ్ రెసిడెన్షియల్ శిక్షణ ఆరురోజులు కొనసాగించనున్నారు. తొలుత ఎంపిపి, ఎంపిడివోలు గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రీసోర్స్ పర్సన్స్ శిక్షణాతరగతులు కొనసాగించి అన్ని అంశాలగురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగి అంకితభావంతో పని చేయాలి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్య పరిధిలో 10 మందికి జూనియర్ సహాయకులుగా పదోన్నత ఉత్తర్వులు, 10 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ సీఈఓ ఎల్ శ్రీధర్ రెడ్డిలు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 188 పదోన్నతులు, 108 కారుణ్య నియామకాలు అందజేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్క ఉద్యోగి అంకిత భావంతో విధులు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు. సకాలంలో పదోన్నత ఉత్తర్వులు,కారుణ్య నియామకాలు అందచేస్తున్న జడ్పీ సీఈవో ఎల్ శ్రీధర్ రెడ్డికి జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మరో వినూత్న కార్యక్రమానికి ఏపీ ఎస్పీడీసీఎల్ శ్రీకారం

● పారిశ్రామిక, వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ ● ఏపీ ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ వెల్లడి



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధీనంలో ఉన్న నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికై ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని ఆ సంస్థ చైర్మన్ ఒ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ తెలిపారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలోని వివరాలిలా ఉన్నాయి. విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుగా ఇప్పటికే 'డయల్ యువర్ సిఎండి', 'డయల్ యువర్ ఎస్ఈ', 'కరెంటోళ్ళ జనబాట' లాంటి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఏపీ ఎస్పీడీసీఎల్ పారిశ్రామిక రంగాన్ని కూడా ప్రోత్సహించడంలో భాగంగా పారిశ్రామిక విద్యుత్ సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుగా 'పారిశ్రామిక వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక'ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతినెలా మొదటి బుధవారం ఉదయం 10:30గంటల నుంచి 11:30గంటల వరకు ఆయా జిల్లాల్లోని సూపరింటెండింగ్ ఇంజనీరు కార్యాలయాల్లోనూ, ప్రతి మూడవ బుధవారం ఉదయం 10:30గంటల నుంచి 11:30గంటల వరకు ఏపీ ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పారిశ్రామిక వినియోగదారులు సంబంధిత జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీరును నేరుగా కలిసి తమ విద్యుత్ సమస్యలను తెలియజేయాలని సూచించారు. జిల్లా స్థాయిలోని సూపరింటెండింగ్ ఇంజనీర్ పరిధిలో మొదటి బుధవారం పరిష్కారానికి నోచుకోని పారిశ్రామిక విద్యుత్ సమస్యలను మూడవ బుధవారం తిరుపతిలోని ఏపీ ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సిఎండిని నేరుగా కలిసి సమస్యల్ని విన్నవించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు. ఈ సదావకాశాన్ని పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### నెల్లూరు సర్కిల్లో.. 'డయల్ యువర్ సిఎండి'కి 50 వినతులు

విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం సోమవారం నెల్లూరు సర్కిల్ కార్యాలయంలో పర్యవేక్షక ఇంజనీరు కే.రాఘవేంద్రం అధ్యక్షతన నిర్వహించిన డయల్ యువర్ ఏపీ ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమానికి 50 వినతులు అందినట్లు, ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఏపీ ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమం జరిగింది. సంస్థ పరిధిలోని 9 జిల్లాల వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు, విద్యుత్ లైన్లు, లో–ఓల్టేజ్ సమస్య, ట్రాన్సా ఫార్మర్ల సామర్థ్యం పెంపు, విద్యుత్ స్తంభాల మార్పు తదితర సమస్యలు వీటిలో వున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా 50 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్, హెచ్ఆర్డి) కె.గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్ఏసి) కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణా దేవి, ఆర్.పద్మ, కె.ఆది శేషయ్య, ఎం.మురళీ కుమార్, ఎం.ఉమాపతి, ఎం.కృష్ణా రెడ్డి, కె.సంపత్ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, జనరల్ మేనేజర్లు సురేంద్రరావు, జగదీష్, చక్రపాణి, శ్రీనివాసులు, లలిత తదితరులు పాల్గొన్నారు.